… మా పెళ్ళి జరుగుతూ వుంటుంది. అందుచేత దయచేసి ఆశీర్వదించాలని ప్రార్థిస్తున్నాను.

(గత సంచిక తరువాయి)

తాను బ్రతకాలి అన్న బలమైన కోరిక మాత్రమే తన భార్య యిన్నాళ్ళు బ్రతకటానికి కారణం అని రామశర్మకు తెలుసు.

కాని అంత బలమైన కోరిక ఆవిడకెందుకుందో రామశర్మకు ఏనాడూ అర్థం కాలేదు

బ్రతకాలన్న కోరిక ప్రాణికి సహజమైంది.

అంత మాత్రమేనా? అంతకు మించిన పరమార్థం ఆవిడ మనసులోవుందా?

ఇది రామశర్మకు తెగని సమస్య

కారణం ఏదైనా తాను చావకూడదన్న బలమైన నిర్ణయంతో ఆవిడ చాలాకాలం నుంచీ మృత్యువును దగ్గరకు రానీయకుండా వుంది.

కానీ ఈనాడు తన భార్య పండుటాకులా రాలిపోతుందేమో నన్న భయం కలిగింది రామశర్మకు.

తన జీవితం ఒక చెట్టులాంటిదైతే దాన్ని అంటిపెట్టుకొని వున్న ఒకే ఒక ఆకు సరస్వతి.

ఆ ఆకు రాలిపోకూడదు!

తాను రాలిపోనివ్వకూడదు!

"జానకి పెళ్ళి విషయం నీకు వదిలేస్తున్నాను సరస్వతీ! నీతోడు. అంతా నియిష్ట ప్రకారమే కానీ." ఎంత స్వాధీనంలో వుంచుకోవాలనుకున్నా రామశర్మ కంఠం వణికింది.

కళ్ళలో మాత్రమే వున్న సరస్వతమ్మ ప్రాణం ఒక్కసారిగా వెలిగింది.

"నిజమేనాండీ?"

"నిజంగానే."

"అలాగైతే యిప్పుడే బయల్దేరుతాను." అన్నది సరస్వతమ్మ

రామశర్మ అడ్డు చెప్పలేదు.

సరస్వతమ్మ బయల్దేరింది.

భార్య ఉత్సాహాన్ని చూచిన రామశర్మకు చాలా బాధ కలిగింది.

చిన్నాన్నగారి వూరినుంచి తిరిగొచ్చిన తరువాత భార్యను ఎలా ఓదార్చాలో ఆలోచించుకుంటూ భార్యను బస్సెక్కించాడు రామశర్మ.

ఎక్కడికెళ్ళాలో అర్థం కాకుండా ఆలోచనా రహితంగా నడుస్తూ తనకు తెలియకుండానే చౌదరి యిల్లు చేరాడు.

రామశర్మ వచ్చేసరికి చౌదరి హాల్లో కూర్చొని కాఫీ తాగుతున్నాడు.

"రా! ఏం యింత ఎండలో వచ్చేశావు? ఏమేవ్! మీ అన్నయ్యొచ్చాడు. కాఫీ తీసుకురా" అన్నాడు చౌదరి.

"ఈ ఎండకు ప్రాణాలు అవిసిపోతుంటే కాఫీ ఎందుకయ్యా' అన్నాడు రామశర్మ ఫాను దగ్గరగా కూర్చుంటూ.

"ఇంత ఎండ పొద్దున బయల్దేరావేం?" మళ్ళీ ప్రశ్నించాడు చౌదరి

"సరస్వతిని బస్‌స్టాండులో వదిలి వస్తున్నాను" చౌదరి ముఖాన్ని పరిశీలనగా చూస్తూ అన్నాడు రామశర్మ.

అకస్మాత్తుగా చౌదరి కళ్ళలో కాఠిన్యం పొడసూపింది. క్రమంగా కనుబొమ్మలు దగ్గరకు చేరాయి.

"ఏ వూరికి?" అన్నాడు.

"వాళ్ళ చిన్నాన్నగారి వూరికి"

"ఎందుకూ?"

"వాళ్ళ చిన్నాన్నకో కొడుకున్నాడు. తిరుపతిలో లెక్చరరుగా పని చేస్తున్నాడు జానకి పెళ్ళి విషయం వాళ్ళతో మాట్లాడాలని...."

చౌదరి నిమిషంసేపు మాట్లాడలేదు. నిమ్మరసం గ్లాసుతో వచ్చిన రాజేశ్వరమ్మ కూడా అలాగే నిశ్శబ్దంగా నిలబడిపోయింది.

"తల విరోధంతో కచ్చితంగా వుంది మీ పద్ధతి" అన్నాడు చౌదరి చివరికి

తనలో పొంగివస్తున్న కోపాన్ని చౌదరి ఎంత కష్టపడి నిగ్రహించుకున్నాడో అర్థం చేసుకున్నాడు. రామశర్మ.

"అంటే?"

"అంటే " కాస తటపటాయించి. మళ్ళీ అన్నాడు. "పండితుడివి నీకు తెలీకేం?"

రామశర్మ మెల్లిగా నవ్వాడు.

"నవ్వవయ్యా. నీ నవ్వు చూస్తే నా ఒళ్ళు మండిపోతోంది " కోపంగా అన్నాడు చౌదరి.

"ఎందుకు?"

"ఈ ముసుగులో గుద్దులాటలు నాకు నచ్చవు. జానకికి ఆ సంబంధం దాదాపు నిశ్చయమైపోయింది. అది నీ ష్టమౌనా కాదా, సూటిగా చెప్పు."

"ఇష్టమే." అన్నాడు రామశర్మ

"అలాగైతే సరస్వతమ్మగారు యీపని చెయ్యటానికి ఎందుకొప్పుకున్నావు."

"ఒప్పుకోకపోతే సరస్వతి నాకు దక్కదు కాబట్టి." రామశర్మ గొంతు కొద్దిగా వణికింది.


"అంటే?"

"చూడు చౌదరీ! ఇది జీవితం. కోర్టు కాదు నన్నలా క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తే జవాబులు దొరకవు."

"అంటే నేను చెయ్యాలనుకున్న సంబంధం చెడగొట్టటానికి నువ్వు తయారయ్యావన్నమాట."

నిమ్మరసం గ్లాసుతో నిలబడివున్న

## పెద్ద కథ:




రాజేశ్వరమ్మకు వీరిద్దరి వైఖరీ చూచి భయం కలిగింది. ఇన్నాళ్ళ వీరిద్దరి స్నేహమూ నేటితో తెగిపోతుందేమోనని పించింది.

"ఎందుకండీ అలా అరుస్తారు. అన్నయ్యగారూ నిమ్మరసం తీసుకోండి. తర్వాత మాట్లాడుకోవచ్చు." అన్నది రాజేశ్వరమ్మ. రామశర్మ చేతికి గ్లాసు అందిస్తూ.

"నీ ఆడపుండ పెత్తనం నా కక్కర్లేదు. పో లోపలికి" కసురుకున్నాడు చౌదరి.

భర్త అన్న మాట కొరడాలా తాకింది రాజేశ్వరమ్మను.

ఇప్పుడు వారిద్దరి మధ్య సర్దుబాటు చేయటం రామశర్మ వంతైపోయింది.

"చౌదరీ! ఏమిటా నోరు! ఎందుకలా అరుస్తావు? ఎంతమాట నోటికొస్తే అంత మాటా అనెయ్యటమేనా?" అన్నాడు రామశర్మ. ఏనాడూ జారనంత అసహ్యంగా తన నోరు జారిపోయిందని చౌదరికి అర్థమైపోయింది.

నిశ్శబ్దంగా కూర్చుండిపోయాడు.

ఎవరూ కాస్సేపు మాట్లాడలేదు.

నిశ్శబ్దంలో ముగ్గురి మనసులూ మెత్తబడసాగాయి.

"ఒక మాట అడుగుతాను. కోపం చేసుకోవుకదూ?" మృదువుగా చౌదరిని ప్రశ్నించాడు రామశర్మ.

"ఊ...." అన్నాడు చౌదరి.

"జానకిని మీ కులంలోనే యిచ్చి పెళ్ళి చెయ్యాలన్న పట్టుదల నీకెందుకు?"

"నాకేం అలాంటి పట్టుదల లేదు."

"ఈ మాట అబద్ధమంటే నీకు మళ్ళీ కోపం వస్తుందేమో! కానీ అనక తప్పటం లేదు"

"నేను అబద్ధం చెప్పటంలేదు."

"పోనీ ఆమాట వదలై. నాకు తెలిసిన బ్రాహ్మణుల అబ్బాయొకతనున్నాడు. అతని నాన్నగారుకూడా నాకు బాగాతెలుసు. వాళ్ళు చాలా మంచివాళ్ళు- సంస్కార ప్రియులు. జానకిని చేసుకోవటానికా అబ్బాయికి, వాళ్ళ నాన్నగారికి ఎటువంటి అభ్యంతరమూలేదు. ఆ అబ్బాయిని చేసుకుంటే జానకి తప్పకుండా సుఖపడుతుంది. ఈ సంబంధం నీకిష్టమేనా?" ప్రశ్నించాడు రామశర్మ.

ఎంతో కాలంగా తప్పించుకుంటూ వచ్చిన ప్రశ్న ఎదురయ్యేసరికి యిబ్బంది పడిపోయాడు చౌదరి.

"నీకిష్టంలేదు - అవునా?" ప్రశ్నించాడు రామశర్మ.

"ఊ....("

"ఎందుకో చెప్పమన్నావా?"

చౌదరి జవాబు చెప్పలేదు.

"నీలో కులతత్వం చావలేదు" అన్నాడు రామశర్మ.

"మాటలు జాగ్రత్తగా రానీ." కోపంగా అన్నాడు చౌదరి.

"నేనెప్పుడూ - యీ యిరవై సంవత్సరాలుగా - యింత జాగ్రత్తగా మాట్లాడలేదు. జ్ఞానకముందా చౌదరీ! మన దేశంలో కుల వ్యవస్థ చచ్చిపోయి చాలా శతాబ్దాలైందనేవాడివి. ఆ మాటను నువ్వు మనస్ఫూరిగా నమ్మలేదని యిప్పుడు అర్థమౌతోంది. సరస్వతిలాంటి వాళ్ళను చూచినప్పుడు ఈ వ్యవస్థ యింకా చావలేదని. నీలాంటి వాళ్ళను చూచినప్పుడు యిప్పుడిప్పుడే చావదని అనిపిస్తుంది" అన్నాడు రామశర్మ.

రామశర్మ యింత కఠినంగా మాట్లాడటం ఎప్పుడూ జరగలేదు.

జవాబు చెప్పలేని చౌదరి నిశ్శబ్దంగా కూర్చుండిపోయాడు.

రాజేశ్వరమ్మకు ఏమీ అర్థం కాలేదు.

ఏదో ప్రమాదాన్ని పసిగట్టినదానిలా భయంతో ముడుచుకుపోయి కూర్చుంది.

"ఏమంటావు?" అన్నాడు రామశర్మ

"నీ యిష్టం వచ్చినట్టు అనుకో. నాకేం అభ్యంతరంలేదు" అన్నాడు చౌదరి.

"ఏమిటన్నయ్యా యిదంతా? నాకేం అర్థం కావటంలేదు. ఏం ఈ సంబంధం మంచిదికాదా? అమ్మాయికి సుఖం వుండదా?" అన్నది.

"నా బ్రతుకు అంత పెద్ద విషయాలు ఆలోచించే స్థితిలో లేదు చెల్లెమ్మా" అంటూ విసవిసా బయటికి నడిచాడు రామశర్మ.

"ఎలా జరగదో చూస్తాను ఈ పెళ్ళి. ఆడపిల్ల పెళ్ళంటే సిద్ధాంతాలు మాట్లాడినంత సులభం కాదని ఋజువు చేస్తాను" పళ్ళమధ్య లోంచి బుసకొట్టినట్లన్నాడు చౌదరి

రాజేశ్వరమ్మకు తల తిరిగినట్లనిపించింది.

మేడమీద వరండా గోడ కానుకుని నిలబడ్డ జానకి తనలో తాను నవ్వుకుంది.

* * *

అన్నం రుచించలేదు రామశర్మకు. తిన్న శాస్త్రం చేసి పడుకున్నాడు. మనసులో ఉక్కపోస్తోంది. అంతకుమించి బయట వీస్తున్న గాలి నిప్పులమీద నుంచి వీస్తున్నట్టుగా వుంది.

నిద్ర పట్టక పోయేసరికి తన అలవాటు ప్రకారం కిటికీ వద్ద నిలబడ్డాడు రామశర్మ. ఒంటరిగా, జంటలుగా, గుంపులుగా సినిమాకుపోయే జనం- జీవితంలో సినిమాకు మించిన విషయం లేనట్టు చర్చించుకుంటూ పోతున్నారు. సినిమా నుంచి వస్తున్న జనం చెమటలో తడిసి దొప్ప దోగుతున్నారు. తాము ధరించలేకపోయిన బట్టల్ని, ఎక్కలేకపోయిన కార్లని, నివసించలేకపోయిన యిళ్ళని- చిట్టచివరికి చెయ్యలేకపోయిన మానభంగాలని సినిమాలలో చూచి సంతోషిస్తున్నారు జనం. రామశర్మకు ఆధునికజీవితం భగ్నస్వప్నం





లకు సంకేతంగా కనిపించింది.... ఆలోచిస్తూ నిలబడ్డ రామశర్మకు ఎవరో తలుపు తట్టటం వినిపించింది....

త్వర త్వరగా వెళ్ళి తలుపు తీశాడు.

సుడిగాలిలా లోపలికొచ్చింది సరస్వతమ్మ.

లోపలికొస్తూనే భర్తను కౌగలించుకొని గొల్లుమంది.

"ఏంసరస్వతీ. ఏంజరిగిందీ?" అన్నాడు ఏం జరిగివుంటుందో వూహించుకోగలిగిన రామశర్మ.

తన భార్య యిలాగే తిరిగొస్తుందని తెలిసినా, ఆమెను చూసేసరికి దుఃఖం పొంగి వచ్చింది.

సరస్వతమ్మ జవాబు చెప్పలేకపోయింది. ఈదురు గాలికి కదలిపోతున్న ఎండిపోయిన తీగలా కంపించిపోతోంది సరస్వతమ్మ.

"ఏమండి .... ఏమండి .... వాళ్ళు నాకు పంచలో అన్నం పెట్టబోయారండి. నేను.... నేను... తినకుండా తక్షణం వచ్చేశానండీ...."

రామశర్మ కన్నీళ్ళు సరస్వతమ్మ నుదుటి మీదికి వెచ్చగా జారాయి.

"భోంచేద్దువుగాని పద ..." అన్నాడు రామశర్మ.

"నావల్లకాదు.... ఈ రోజు నా కన్నం దిగదండి." అన్నది కళ్ళు తుడుచుకుంటూ సరస్వతమ్మ.

రామశర్మ జవాబు చెప్పలేదు

"ఏమండి."

అకస్మాత్తుగా సరస్వతమ్మ కంఠం వినిపించిన ఉద్రేకాన్ని చూచి ఆశ్చర్య పోయాడు రామశర్మ.

"ఏమి - సరస్వతీ?" అన్నాడు.

విశాలంగా తెరుచుకున్న సరస్వతమ్మ లోతైన కళ్ళలో కనుపాపలు. యినుప గోలిగుళ్ళలా మెరిశాయి.

"మన జానకిని ఏమైనాకానీ మంచి బ్రాహ్మణ కుటుంబంలోనే ఇచ్చి చేయాలండి "

"ఎందుకూ?"

"నేను కన్న కూతుర్ని ఎవరు పెంచినా అది నా కూతురేనని, ఇతరులు పెంచినంత మాత్రాన దానికి కులం పోలేదని నిరూపించటానికి."

"ఎవరికి నిరూపించాలి?" ప్రశ్నించాడు రామశర్మ.

"మా చిన్నాన్నలాంటి వాళ్ళకి."

"ఎందుకూ?"

"ఎందుకేమిటి ? వాళ్ళనుకుంటున్నది తప్పు. అందుకు."

"అలా చేస్తే నీ కొరిగే దేమిటి?"

"ఒరిగే దేముంది వాళ్ళకు బుద్ధొస్తుంది అంతే."

రామశర్మ జవాబు చెప్పలేదు.

"జవాబు చెప్పండి?" అన్నది సరస్వతమ్మ.

"అలాగే" అన్నాడు రామశర్మ.

చీకటి పరుచుకున్న వీధిలో అక్కడక్కడా వున్న దీపాలు చీకటిని చెదరగొట్టటానికి విఫల ప్రయత్నం చేస్తున్నాయి.

* * *

"మండీ కెళ్తున్నాను. ఏం కావాలో చెప్పు. గుమాస్తా చేత పంపుతాను" అన్నాడు చౌదరి గడియారానికి కీ యిస్తూ.

గడియారం ఎనిమిది గంటలు చూపుతోంది

తెల్లవారుజామున వీచిన చల్లని గాలి ఆగిపోయింది. ఎండ అప్పుడు చురచుకలాడుతోంది.

"దండిగా పూలు. పళ్లు, తమలపాకులు" అన్నది రాజేశ్వరమ్మ.

"అంతేనా?"

"అంతే! మిగిలిన వస్తువులన్నీ యింట్లోనే వున్నాయి. ఇంతకూ వాళ్ళెన్ని గంటలకొస్తామన్నారు?"

"సాయంకాలం నాలుగ్గంటలకు."

"ఇంతకూ యీ పెళ్ళికూతురు నిద్రలేవలేదేం?" మేడమీదికి నడుస్తూ అన్నది రాజేశ్వరమ్మ.

"సరస్వతమ్మ గారింటికి నన్నే వెళ్ళి రమ్మంటావా?"

" లేవెళ్ళాలి బంగారంలాంటి స్నేహితుణ్ణి నోటికొచ్చిన మాటలన్నది

మీరేగా." మెలికలు తిరుగుతున్న రాజేశ్వరమ్మ వెనక్కి తిరిగి, చిరునవ్వుతో అన్నది.

చౌదరి మెలికలు తిరుగుతున్న భార్యను చూస్తూ నిలబడ్డాడు.

'నేను కాస్త నాజూగ్గా ప్రవర్తించాలి. లేకుంటే పనులు జరగవు.' అనుకున్నాడు.

చేతి సంచి అందుకొని, చెప్పులు తొడుక్కుంటుండగా, మేడ మీద నుంచి రాజేశ్వరమ్మ "ఏమండీ!" అని అరిచింది.

ఆ అరుపు విన్న చౌదరికి గుండె ఆగిపోయినట్లనిపించింది.

"రాజీ!" అన్నాడు చౌదరి, తన శక్తి నంతా ప్రయోగించి.

రాజేశ్వరమ్మ బదులు పలకలేదు.

మేడ మీదికి పరుగెత్తాడు చౌదరి....

పరుగు పరుగున లోపలకొచ్చిన రామశర్మకు, పిచ్చివానిలా మేడ మీదికి పరుగెత్తుతున్న చౌదరి కనిపించాడు. ఇద్దరూ జానకి గది చేరేసరికి రాజేశ్వరమ్మ నేల మీద స్పృహతప్పి పడివుంది.

క్షణంలో భార్యను తన ఒడిలోకి తీసుకున్నాడు చౌదరి.

పక్కనే వున్న కూజాలోని నీళ్ళు రాజేశ్వరమ్మ ముఖం మీద చిలకరించాడు రామశర్మ.

రెండు నిమిషాల తరువాత నెమ్మదిగా కళ్ళు తెరిచింది రాజేశ్వరమ్మ.

"ఏం రాజీ, ఏం జరిగింది?" ఆతురతతో ప్రశ్నించాడు చౌదరి.

"జానకి.... మన జానకి ఎక్కడికో పారిపోయింది."

"నీకెలా తెలుసు" చుట్టూరా చూచాడు చౌదరి.

"దాని బట్టలేవీ లేవండీ."

"నిజంగానా!" చౌదరి చూపు రామశర్మ మీద నిలిచింది.

అనుమానం నిండిన చౌదరి చూపు రామశర్మకు కత్తిలా గుచ్చుకుంది.

"అమ్మాయి.... ఉత్తరం....". రాజేశ్వరమ్మ అన్నది. తన చేతులోంచి జారిపోయిన వుత్తరంకోసం చూస్తూ.

రామశర్మ తన జేబులోంచి ఒక వుత్తరంతీసి చౌదరి చేతికిచ్చాడు.

"ఏమిటది?" కసురుకున్నట్టుగా అడిగాడు చౌదరి.

"జానకి వుత్తరం, నాకూ వచ్చింది."

"ఎప్పుడు."

"ఇప్పుడే- అరగంటక్రితం తలుపు తెరిచేసరికి గదిలో పడివుంది"

చౌదరి వుత్తరం చదవసాగాడు—

"అమ్మలకు, నాన్నలకు- నమస్కారాలు.

"ప్రపంచంలో ఎవరికైనా ఒక అమ్మ, ఒక నాన్న మాత్రమే వుంటారు. నాకిద్దరు అమ్మలు, యిద్దరు నాన్నలు వున్నారు. నేను చాలా అదృష్టవంతురాలిని.

"నా సమస్యను ఎలా పరిష్కరించాలో అర్థంకాక మీరు సతమతమై పోతుండటం చాలా రోజులనుంచీ గమనిస్తున్నాను. ఇంత వయసొచ్చాకకూడా నా సమస్యలతో మిమ్మల్ని బాధించటం యిష్టంలేక, నా సమస్యను నేనే పరిష్కరించేస్తున్నాను. శ్రీధర్ రెడ్డి అనే స్నేహితుడితో కలసి బెంగుళూరు వెళ్తున్నాను. తిరిగొచ్చేసరికి మేము భార్యాభర్తలుగా వుంటాము. మా కాబోయే శ్రీవారికి మీ నలుగురికీ అల్లుడు కాదగిన అన్ని లక్షణాలూ నిస్సందేహంగా వున్నాయి. ఆ మాట మీరే అంగీకరిస్తారని మా యిద్దరికీ తెలుసు.

"అన్నట్టు అసలు విషయం మరచిపోయాను. మా పెళ్ళి తర్వాత అలా నాలుగు రోజులు తిరిగి మళ్ళీ మీ దగ్గరికే వస్తాము. ఇప్పుడు మీకెంత కోపం వచ్చినా అదంతా మేము తిరిగొచ్చేసరికి తగ్గిపోయి వుంటుంది. ఆ మాటకొస్తే మా కోసం మీరు ఎదురు చూస్తూ వుంటారని కూడా మాకు తెలుసు.

"నాకు రెండు అమ్మగారిళ్ళు మా కాబోయే శ్రీవారికి రెండు అత్తగారిళ్ళు వుండటం ఎంత అదృష్టం! ఈ ఉత్తరాలు మీకందేసరికి మా పెళ్ళి జరుగుతూ వుంటుంది. అందుచేత దయచేసి ఆశీర్వదించాలని ప్రార్థిస్తున్నాను.

"మీ అసలు రహస్యం- ఆ మాటకొస్తే నా అసలు రహస్యం - నాకెలా తెలిసిపోయిందనేది చాలా పెద్ద కథ. అది బొంబాయిలో ప్రారంభమౌతుంది చెప్పటానికిప్పుడు వ్యవధిలేదు. తిరిగొచ్చాక వివరంగా చెబుతాను.

మీ కూతురు

—జానకి"

"అమ్మయ్య" అన్నది రాజేశ్వరమ్మ.

ఉత్తరాన్ని చదివిన చౌదరి నిరాశతో మంచం మీద కూలబడిపోయాడు.

"వస్తా చెల్లెమ్మా. మీ అక్కయ్య నీకంటే ఎక్కువ దిగాలుపడిపోయింది. వెళ్ళి దాని సంగతి చూస్తాను." లేచాడు రామశర్మ.

గదిమూల రెపరెపలాడుతున్న కాగితాన్ని చూస్తున్న చౌదరి వెళ్ళిపోతున్న రామశర్మను గమనించలేదు.

"సార్! టెలిగ్రామ్!" రెండు నిమిషాల తరువాత క్రిందనుంచి టెలిగ్రామ్ బంట్రోతు పిలుపు వినిపించింది.

* * *

ముఖమంతా నవ్వు చేసుకొని వంటింట్లో కొచ్చాడు చౌదరి.

"రాజీ! అసలు సంగతి తెలుసా?" అన్నాడు.

"ఏ సంగతి, తెలీదు." అన్నది రాజేశ్వరమ్మ.

"అలాగైతే విను. మనబ్బాయిలేడూ.."

"మనబ్బాయెవరండీ?"

"అదేనే మన అల్లుడు - శ్రీధర్ రెడ్డి. అసలు వాళ్ళు రెడ్లు కారట; మనవాళ్ళేనట. ఎందుకోగానీ వాళ్ళ వూళ్ళో మన వాళ్ళంతా అలా పేర్లు పెట్టుకుంటారట" ఎంతో ఉత్సాహంగా అన్నాడు చౌదరి.

"అలాగా?" అన్నది రాజేశ్వరమ్మ.

ఆవిడ కంఠంలో మృదువుగా ధ్వనించిన వ్యంగ్యం చౌదరికి వినిపించలేదు.

* * *



పూర్తి జీవితానికి అసాధారణమైన బలం

జీవనానికి మరింత కుతూహలాన్ని చేకూర్చిపెడుతుంది. ఒకాసా మీ శరీరంలో బలం, శక్తి తిరిగి సమకూర్చటానికి ఇందు శక్తివంతమైన 6 రసాయనిక పదార్థాలు, 6 ఖనిజములు, 10 అత్యావశ్యకమైన విటమినులు, అశ్వగంధ, యొహింబైన్ వంటి మొక్కల సారములు ఇమిడి వున్నాయి. ఒకాసా తీసుకోండి. జీవితం ఆనందమయమౌతుంది.

ఇప్పుడు అనువైన కొత్త ప్యాక్‌లో

ఒకాసా

పేరెన్నికగన్న అన్ని మందుల దుకాణాలలోనూ దొరుకుతుంది.

ఒకాసావారి ఉచిత పుస్తకంకోసం వ్రాయండి!

OKASA CO. PVT. LTD.
P.O.Box No. 396, Bombay-400 001.

"ఆ అబ్బాయి దేవ్వరన్నారు?" కన్నీళ్ల చారికలు కట్టి పోయిన ముఖం పైకెత్తి ప్రశ్నించింది సరస్వతమ్మ.

తన అలవాటు ప్రకారం కిటికీవద్ద నిలబడి వున్న రామశర్మ చెప్పాడు.

"అలాగా! అలాగైతే రాఘవరెడ్డిగారు అబ్బాయి కేమౌతారట?"

"శ్రీధర్ నాన్నగారే రాఘవరెడ్డిగారు"

పడుకోనున్న సరస్వతమ్మ నిటారుగా లేచి కూర్చుంది.

వెనక్కి తిరిగిచూచిన రామశర్మ ఆశ్చర్యపోయాడు.

చాలా సంవత్సరాలుగా కనిపించని వింత కాంతితో ఆవిడ కళ్ళు వెలిగిపోతున్నాయి.

"అలాగా! ఆ సంగతి యింతకుముందే ఎందుకు చెప్పలేదు మీరు?" ఉత్సాహంతో ప్రశ్నించింది సరస్వతమ్మ

"నాక్కూడా ఈరోజే తెలిసింది"

"మా సుబ్బమ్మత్త మామగారుండే వారు చూచారా- వారి చెల్లెలి కూతురు లేమో...."

"నాకు తెలీదు" అన్నాడు రామశర్మ.

"మీకు తెలీదులెండి. ఆమె పోయింది. ఆమె పినతల్లి కూతురు మీనాక్షే ఈ రాఘవరెడ్డిగారి భార్య!"

"అలాగా?"

"దాన్ని వెలివేశారనుకోండి. ఆ పెళ్ళికి మా వాళ్ళెవరూ వెళ్ళలేదు. అప్పటికింకా మాకు చిన్నతనం ఆ పెళ్ళిని గురించి మా వాళ్ళంతా చోద్యంగా చెప్పుకున్నారు.

రామశర్మ జవాబు చెప్పలేదు.

"అలాగైతే ఈ శ్రీధర్ మా మీనాక్షి కొడుకన్నమాట" సంతోషం పొంగిపోతున్న కంఠంతో అన్నది సరస్వతమ్మ

రామశర్మ మళ్ళీ కిటికీ వైపుకు తిరిగాడు.

"వాళ్లు బాగా డబ్బున్న వాళ్ళనుకుంటాను కదండీ?" ప్రశ్నించింది సరస్వతమ్మ.

రామశర్మ పెదవుల మీద వ్యంగ్యంగా కదలిన చిరునవ్వు సరస్వతమ్మకు కనిపించలేదు.




KANTA CHAP

కనులకు విందు- కంటికి యింపు చూడ ముచ్చట గొలిపే బొంబె డైయింగ్ వారి 100% పోలిస్టరు కోసలిన్, జార్జెటు, పోలిస్టరు 2 కట్సు చీరెలు, సరిక్రొత్త డిజైన్ల స్టాకు వచ్చినది. దయచేయండి.

బొంబె డైయింగ్ షో రూం

శ్రీ లక్ష్మి

కొత్తగూడెం.

ముందు ప్రెస్టేజి ప్రెషర్ కుక్కర్లు

ఉచితం!

(10 లీ: 6 లీ: 4 లీటర్లవి)



కృష్ణా మెటల్ స్టోర్స్

విజయవాడ-2

భారతదేశంలో 10 వేల ప్రెస్టేజ్ ప్రెషర్ కుక్కర్లు అమ్మిన గౌరవము మా సంస్థకు దక్కించిన మా శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు.

ఈ సందర్భంగా ప్రతి మెంబరుకు మూడు ప్రెస్టేజ్ కుక్కర్లు ఉచితం!

1. ప్రతి సభ్యుడు ఒకేసారి రూ. 360/- గాని రూ. 10/- చొ. న 36 వాయిదాలలో 360/- గాని కట్టవలయును.
2. 360/- ఆంధ్ర బ్యాంకు వారి క్యాష్ సర్టిఫికేట్ మీ పేరున వెంటనే ఇచ్చివేయబడుతుంది. అంటే మీ డబ్బు మీకు పూర్తిగా వాపసు ఇచ్చివేయబడుతుంది, మరియు 3 కుక్కర్లు-షుమారు రూ. 700/- విలువగలవి ప్రతి మెంబరుకు ఉచితం!

మా ఖాతాదార్లకు ప్రత్యేక సదుపాయము: మా వద్ద మాత్రమే ఒరిజనల్ స్పేర్ పార్టులు కంపెనీవారి అజమాయిషీలో లభించును. ఒక సం॥ము సర్వీసింగ్ ఉచితం!

తయారిదార్లు: టి. టి. ప్రైవేట్ లిమిటెడ్

టి.టి. కృష్ణమాచారి గార్ల సహకారంతో

ఇట్లు

ప్రొ॥ రావి పిచ్చయ్య

కృష్ణా మెటల్‌స్టోర్స్

ప్రకాశంరోడ్; విజయవాడ-2; ఫోన్: 73000